


RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

సోమవారం, 26 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 74

## మున్సిపల్ ఎన్నికల వేళ అనూహ్య నిర్ణయం

### తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారు తున్నా యి. సీఎం రేవంత్ ఇప్పటికే మంత్రులకు జిల్లాల వారీగా మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలను అప్పగించారు. జిల్లాల పర్యటనలకు సిద్ధం అయ్యారు. బీజేపీ రాష్ట్ర ఇంఛార్జ్ లు హైదరాబాద్ లో మకాం వేసి మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ ని సమాయత్తం చేస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పురపోరులో సత్తా చాటాలని భావిస్తో ంది.మున్సిపల్ ఎన్నికలకు కౌంట్ డౌన్ మొద లైంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం తుది కసరత్తు చేస్తోంది. పార్టీలు సైతం కార్యాచరణ వేగవంతం చేసాయి. నేరుగా సీఎం రేవంత్ మున్సిపల్ ఎన్నికల కోసం జిల్లాల వారీగా కసరత్తు చేస్తున్నారు. అభ్యర్థుల ఖరారు నుంచి గెలుపు వరకు మంత్రులకు బాధ్యతలను సీఎం అప్పగించారు. జిల్లా పర్యటనల్లో వరాలు ప్రకటిస్తున్నారు. అటు పార్టీ హైకమాండ్ సైతం ఈ పుర పోరును సీరియస్ గా తీసుకుంది. ఈ ఫలితాలు మంత్రుల సమర్థతకు పరీక్షగా మారనున్నాయి. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో ఈ ఫలితాలు కీలకంగా మారనున్నాయి. కాగా, ప్రతిపక్ష పార్టీలు బీఆర్ ఎస్.. బీజేపీ సైతం ఈ ఎన్నికల కోసం తమ వ్యూహాలను అమలు చేస్తున్నాయి. ఇందు కోసం తాజాగా మాజీ సీఎం కేసీఆర్ తో కేటీఆర్ సమావేశం అయ్యారు.కీలక నిర్ణయాలు కేసీఆర్ సూచనల మేరకు కేటీఆర్, హరీష్ మున్సిపల్ ఎన్నికల బాధ్యతలను స్వీకరించారు. తాజాగా...మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ ఇన్ఛార్జులను నియమించింది. ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాల్టీల వారీగా సమన్వయ కర్తల జాబితాను ప్రకటిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌కి సీనియర్ నాయకుడికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## జల సంకల్పానికి మోదీ సలాం



అనంతపురం :కరవుతో కుంగిపోయిన ప్రాంతాల్లో కూడా... ప్రజల సంకల్పం ఉంటే మార్పు సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కొరత సమస్యను తట్టుకుని నిలబడేందుకు చేపట్టిన స్వచ్ఛంద ప్రయత్నాలను ఆయన హృదయపూర్వకంగా ప్రశంసించారు. ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ 130వ ఎపిసోడ్‌లో ఈ అంశాన్ని ప్రధాని ప్రస్తావించారు.వర్షపాతం తీవ్రంగా తగ్గిపోవడంతో అనంతపురం ప్రాంతంలో నీటి ఎద్దడి సాధారణ సమస్యగా మారిందని ప్రధాని గుర్తు చేశారు. అయితే, ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు అక్కడి ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి జలాశయాల పునరుద్ధరణకు నడుం బిగించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇప్పటివరకు పది కంటే ఎక్కువ చెరువులు, పేర్కొన్నారు.

## మూడో ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా భారత్.. జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి గణతంత్ర ప్రసంగం



న్యూఢిల్లీ: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశమైన భారతదేశానికి మూలస్తంభమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. రేపు(సోమవారం) జనవరి 26 సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలకు ఘనంగా నివాళులర్పించారు రాష్ట్రపతి. దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ హోదా, గతం, వర్తమానం, భవిష్యత్తులో దేశ దిశానిర్దేశాన్ని చాటిచెప్పే అమూల్యమైన సందర్భం ఇదని రాష్ట్రపతి అన్నారు. ప్రపంచంలో పలుచోట్ల అనిశ్చిత పరిస్థితి ఉన్నప్పటికీ భారతదేశం త్వరలోనే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలువనుందని చెప్పారు. సోమవారం నాడు దేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న నేపథ్యంలో రాష్ట్రపతి ఆదివారం నాడు దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.భారతదేశ ప్రజాస్వామ్య జర్నీని వివరిస్తూ, పొందుపరిచి ఉన్నాయని అన్నారు.

## టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు కవిత ఓపెన్ ఆఫర్



హైదరాబాద్ :తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల వేళ కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికలు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠా త్మకంగా మారుతున్నాయి. ఇదే సమయంలో కవిత నాయకత్వంలో జాగృతి సైతం ఎన్నికల బరిలో దిగేలా నిర్ణయం తీసుకుంది. పార్టీ గుర్తు ఖరారు చేసింది. కాగా, ఇప్పుడు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు కవిత ఇచ్చిన ఓపెన్ ఆఫర్ రాజకీయంగా సంచలనంగా మారుతోంది.జాగృతి సంస్థ రాజకీయంగా ఎంట్రీ ఇస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఈ సమయంలో కవిత కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ లో చేరనుందనే ప్రచారం పైన తీవ్రం గా స్పందించారు. తాను కాంగ్రెస్ లో ఎందుకు చేరుతానని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయే పార్టీ అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జాగృతి గెలువబోతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. తనను బద్నాం చేసే పనిలో మహేశ్ గౌడ్ ఉన్నారని ఆరోపించారు. మహేష్ గౌడ్ తన మానసిక పరిస్థితి చెక్ చేసుకోవాలని హితవు పలికారు. బలమైన రాజకీయ పార్టీగా జాగృతిని మార్చే ప్రయత్నం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు. మహేష్ గౌడ్ జాగృతి లో చేరాలని.. మంచి పోస్టు ఇస్తానని బంపరాఫర్ ఇచ్చారు.టార్గెట్ హరీష్‌కాగా, మరోసారి హరీష్ రావు లక్ష్యంగా కవిత కీలక వ్యాఖ్యలు చేసారు. సృజన్ రెడ్డికి కాం్ర టాక్టర్లు ఇప్పించింది ఆయన పెద్ద తిమింగలంగా మారటానికి హరీశ్‌రావునే కారణమని చెప్పారు. అదే సమయంలో సృజన్ రెడ్డి.. రేవంత్‌రెడ్డి బావమరిది అని హరీశ్‌రావుకు అప్పుడు తెలియదా అంటూ ప్రశ్నించారు. హరీశ్‌రావు తవ్విన గుంతలో మాజీ మంత్రి కేటీఆర్ పడటం బాధాకరమని వ్యాఖ్యా నించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు లేఖ రాయనని హరీశ్‌రావు అనటం దళిత ఉప ముఖ్యమంత్రిని అవవ ానించటమేనని చెప్పుకొచ్చారు.కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మాత్రమే లేఖ రాస్తానని హరీ శ్‌రావు అంటున్నారని... రాష్ట్ర ప్రభుత్వం అడగకుండా రాష్ట్రానికి సీబీఐ ఎలా వస్తుందని ప్రశ్నించారు. 2014 నుంచి జరిగిన సింగరేణి టెండర్లపై విచారణ జర పాలని ఆయన అంటున్నారని..

అంటే కేసీ ఆర్ పాలనపై కూడా హరీశ్‌రావు విచారణ కోరుతున్నట్లే కదా అంటూ కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. హరీష్ రావు బాధ అంతా కమీషన్ల కోసమే అని కవిత ఆరోపించారు.

## మందు బాబులకు అలర్ట్

## వైన్స్, బార్లు బంద్



న్యూఢిల్లీ: మద్యం ప్రియులకు అలర్ట్. దేశ గణతంత్ర వేడుకల సందర్భంగా జనవరి 26న మద్యం విక్రయాలకు పూర్తిస్థాయి బ్రేక్ పడనుంది. జాతీయ పర్వదినాన్ని పురస్కరి ంచుకుని ప్రభుత్వం రేపటి రోజును డ్రై డేగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో వైన్ షాపులు లిక్కర్ దుకాణాలు, బార్లు పూర్తిగా మూత పడనున్నాయి. ప్రజా శాంతి భద్రతలు, వేడుకల నిర్వహణ సజావుగా సాగాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.రిపబ్లిక్ డే రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎక్సైజ్ శాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలను అతిక్రమించి మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వైన్ షాపుల యజమానులు వినియో గదారులకు సమాచారం అందిస్తూ షాపుల వద్ద నోటీసులు ఏర్పాటు చేస్తున్నారు.ప్రతి సంవత్సరం జాతీయ ప్రాముఖ్యత కలిగిన రోజుల్లో మద్యం అమ్మకాలను నిలిపివేయడం పరిపాటిగా కొనసాగుతోంది. గణతంత్ర దినోత్సవంతో పాటు స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి వంటి సందర్భాల్లో కూడా ఇదే విధమైన ఆంక్షలు అమలులో ఉంటాయి. ఈ నిర్ణయంతో ఒక్కరోజు పాటు మద్యం విక్రయాలకు విరామం లభించనుంది.డ్రై డే ముగిసిన అనంతరం జనవరి 27 నుంచి సాధారణంగా మద్యం విక్రయాలు పునఃప్రారంభం కానున్నాయి.

## సీఎం రేవంత్ కు హరీష్ అనూహ్య డిమాండ్



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కోసం అటు ఎన్నికల సంఘం.. ఇటు రాజకీయ పార్టీలు సిద్ధం అవుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లోనే షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలోనే ఫోన్ ట్యాపింగ్, సింగరేణ్ గనుల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. ఈ సమయంలో సీఎం రేవంత్ కు బీఆర్ఎస్ ముఖ్య నేత హరీష్ అనూహ్య డిమాండ్ చేసారు.
ముఖ్యమంత్రి రేవంత్ లక్ష్యంగా మాజీ మంత్రి హరీష్ కీలక వ్యాఖ్యలు చేసారు. సింగరేణి స్కాంలో రేవంత్‌రెడ్డినే లబ్ధిదారుడని ఆరోపిం చారు. స్కాంలు, కాంగ్రెస్ అరాచకాలతో సింగరేణి సంస్థపై భారం పెరిగిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో స్కీంలు లేవు.. కానీ స్కాంలు పెరిగిపో యాయని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ కాదని.. రేవంత్‌రెడ్డి స్కాంల క్యాలెండర్‌ను తెచ్చారని హరీష్ వ్యాఖ్యానించారు. ఆంధ్రా నేతలతో రేవంత్‌రెడ్డి చేతులు కలిపి.. నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో అత్యుత్తమ హోదా పొందటానికి అందరికంటే ఎక్కువ అర్హత ఉన్న నాయకుడు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కనేనని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు. అంతటి అనుభవం ఉన్న భట్టి విక్రమార్క.. రేవంత్‌రెడ్డి కళ్లల్లో ఆనందం కోసం పనిచేయటం బాధాకరమని పేర్కొన్నారు. సింగరేణి స్కాంపై సీబీఐ లేదా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని హరీష్ డిమాండ్ చేశారు.కాగా, డిప్యూటీ సీఎం భట్టి లబ్ధిదారుడా లేదా అనేది విచారణలో తేలుతుందని తెలిపారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు గతంలో మంత్రులు రాజీనామా చేసేవారని ప్రస్తావిం చారు. సింగరేణి ఓబీ వర్క్స్‌కు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తెచ్చిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. తనకు లేఖ రాస్తే.. ముఖ్యమంత్రితో మాట్లాడుతానని భట్టి అనటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రేపో, మాపో తమకు మరో ప్రేమ లేఖ(సిట్ నోటీసు) వస్తుందని సెటైర్ వేసారు. సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది బాగోతం బయట పడకుండా.. భట్టి రక్షిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ నేతల స్వార్థం కోసం వారికి అనుకూలంగా సింగరేణి విధనాలను మార్చారని ఆక్షేపించారు. 2018లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ ఉందని భట్టి తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. భారతదేశంలో ఓబీ వర్క్స్ సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానమే లేదని స్పష్టం చేశారు. 2018 నుంచి 2024 వరకు అనేక ఓబీ వర్క్స్‌కు టెండర్లు జరిగాయని... వాటికి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం లేదని ప్రస్తావించారు.


## ఏపీ ప్రభుత్వ సలహాదారు పదవి, మంతెన అనూహ్య నిర్ణయం



అమరావతి :ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ప్రభుత్వం తాజాగా ఆయన్ను ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. ప్రత్యేకంగా ఆశ్రమం నిర్వహణతో పాటుగా ఆరోగ్య పరమైన సూచనలు.. సలహాలు ఇవ్వటం ద్వారా మంతెన ప్రముఖ గుర్తింపు పొందారు. తాజాగా సీఎం చంద్రబాబు తో మంతెన సమావేశమయ్యారు. ఈ సమయంలో ప్రకృతి వైద్య సలహాదారుగా తన బాధ్యతల పైన చర్చించారు. అదే సమయంలో సలహాదారు హోదాలో తన నిర్ణయం ఏంటో వెల్లడించారు. ప్రకృతి వైద్య రంగంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు అనుభవాన్ని వినియోగించుకునే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయన్ను ప్రకృతి వైద్య సలహాదారుగా నియమించింది. డాక్టర్ రాజు రెండే ళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన విధానా లపై ప్రభుత్వానికి డాక్టర్ రాజు సలహాలు, సూచనలు అందించనున్నారు. మంతెన ఇప్పటికే అమరావతి సమీపంలో మంతెన ఆరోగ్యాలయం పేరుతో ప్రకృతి చికిత్సాలయం, పరిశోధన కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కాగా, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంతెన సత్యనారాయణ రాజు సమావేశం అయ్యారు. ముఖ్యమంత్రి డాక్టర్ మంతెన 35 సంవత్సరాల సేవలను ప్రశంసించారు. ప్రభుత్వం బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి సంజీవని ప్రాజెక్టు వంటి అనేక ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నంలో డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు లాంటి నిపుణుల సలహాలు, సూచనలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అందువల్ల, యోగా, నాచురోపతి విభాగం నుంచి ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించాలని ఆయన డాక్టర్ రాజు కు సూచించారు.
దీనికి స్పందనగా మంతెన తన అభిప్రా యాలను వెల్లడించారు. తాను ఏ హోదాలు, పోస్టులు తీసుకోకూడదనే నియమాన్ని పెట్టుకున్నానని వివరించారు. తాను వెనుక ఉండి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందిస్తానని, ప్రభుత్వ సహకారం ఉంటే తాను చేస్తున్న పనికి రెట్టింపు ఉత్సాహంతో, ఎక్కువ సమయాన్ని కేటాయించి సేవ చేస్తానని పేర్కొన్నారు. అయితే, హోదా లేకపోతే మాటలకు గౌరవం ఉండదని, ఆచరణలోకి వెళ్లదని, పదవిలో ఉండి చెబితే అమలుకు అవకాశాలు ఎక్కువగా ఉంటా యని ముఖ్యమంత్రి వివరించారు. దీనివల్ల ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దీంతో.. మంతెన తాను సలహాదారుగా ఉండాలంటే, క్యాబినెట్ హోదాతో వచ్చే ఏ సదుపాయాలనూ తాను తీసుకోనని స్పష్టం చేశారు. ఇందులో నెల జీతం, ప్రభుత్వ కారు, ఇతర ఖర్చులు, ఇంట్లో సహాయకుల జీతాలు, విమాన, రైలు టిక్కెట్లు, కార్యాలయ సదుపాయాలు వంటివి ఏవీ స్వీకరించనని స్పష్టం చేసారు. చివరకు మంతెన అభిప్రాయాలకు ముఖ్యమంత్రి అంగీకరించారు.

## తిరుమల కిటకిట, ఒకే రోజు ఏడు వాహనాల్లో

## శ్రీవారి దివ్య దర్శనం



తిరుమల :రథసప్తమి వేళ తిరుమల భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి సన్నిధిలో ఈ రోజు సూర్య జయంతి (రథస ప్తమి) పర్వదినం ఘనంగా జరుగుతోంది. బ్రహ్మోత్సవంలా జరిగే అపురూప సందర్భం. శ్రీ మలయప్ప స్వామి వారు (కోనేటిరాయుడు) ఏడు విభిన్న వాప నాలపై (సప్త వాహన సేవలు) తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దివ్య దర్శనం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రముఖ ఆలయాల్లోనూ రథసప్తమి వేడుకలు కొనసాగుతున్నాయి.తిరుమలలో రథసప్తమి ఒక చిన్న బ్రహ్మోత్సవంలా జరిగే అపురూప సందర్భం. స్వామి వారి దర్శనం కోసం నిన్న సాయంత్రం నుంచే భక్తులు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో వేచి ఉన్నారు. టీటీడీ అధికారులు భక్తులకు అన్నప్రసాదం, పానీయాలు పంపిణీ చేస్తున్నారు. గ్యాలరీలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఉదయం 5:30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో స్వామివారి సేవలు ప్రారంభమయ్యాయి. సూర్యోదయ సమయంలో సూర్యప్రభపై శ్రీవారిని దర్శించడం భక్తులకు అద్భుత అనుభూతిని కలిగించింది. తర్వాత చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హంస వాహనం, అశ్వ వాహనం, గజ వాహనం వంటి వాహనాలపై స్వామి వారు ఈ రోజు ఊరేగుతారు. రాత్రి 8:00 గంటలకు చంద్రప్రభ వాహన సేవతో ఈ దివ్య వాహన సేవలు ముగుస్తాయి. ఈ వేడుక నేపథ్యంలో ఆలయ మహద్వారం నుంచి స్వామివారి సన్నిధి వరకు వర్ణరంజిత పుష్పాలు, విద్యుత్? దీపాలతో అలంకరించారు. ఇందుకు పది టన్నుల సంప్రదాయ పువ్వులు వినియోగించారు.పెరిగిన భక్తుల రద్దీస్వామివారు విహరించనున్న తిరువీధుల్లో సకల ఏర్పాట్లు చేపట్టారు.

# శ్రీ తిరుమలనాథ స్వామి కళ్యాణోత్సవం లో పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.





**మెదక్ రామయంపేట మండలం జనవరి 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
రామాయంపేట మండల పరిధిలోని గ్రామంలో ఆదివారం జరిగిన శ్రీ తిరుమలనాథ స్వామి కళ్యాణోత్సవంలో మైనంపల్లి రోహిత్ రావు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యే రోహిత్ రావుకు ఘన స్వాగతం పలికారు. అనంతతరం ఎమ్మెల్యే శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, చల్మెడ గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సి ఏం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రోహిత్ రావు.



**మెదక్ జనవరి 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పాపన్నపేట మండలంకు సంబంధించిన 46 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అనారోగ్యానికి గురైతే వారికి మంచి వైద్యం చేసుకునేందుకు వీలుగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట కాంగ్రెస్ నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించిన చెరుకు శ్రీనివాసరెడ్డి



**చేగుంట జనవరి 25 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామంలో ప్రమాదాస్తు ఎగ్గడి శ్యామల భర్త నర్సయ్య గుడిసె దగ్నంఅయిన విషయం తెలిసి దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరిశీలించి వారి కుటుంబాన్ని పరామర్శించి తక్షణమే అధికారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయించారు. ఈ కార్యక్రమంలో చేగుంట మండల మార్కెట్ కమిటీ ఛైర్మెన్ తాడేం వెంగళరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ,గ్రామ నాయకులు ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# సూర్య దేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి: నీలం మధు ముదిరాజ్ సంగారెడ్డిలో ఘనంగా రథసప్తమి వేడుకలు





**పటాన్ చెరు జనవరి: 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సూర్య భగవంతుని ఆశీస్సులు తమపై ఉండాలని ప్రజలు రథసప్తమి రోజున భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.ఆదివారం రథసప్తమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి నియోజకవర్గం ఫసల్వాది గ్రామ పరిధిలోని శ్రీ జ్యోతిష్వరస్తు విద్యాపీఠంలో బ్రహ్మశ్రీ డా,, శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన పాపనాశ రథసప్తమి వ్రతక్రతువు పూజా కార్యక్రమంలో నీలం పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు, ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఆడపడుచులు ఇంత పెద్ద సంఖ్యలో హాజరై వ్రతంలో పాల్గొనడం సంతోషకరం అన్నారు, ఈ రథసప్తమి భక్తుల జీవితాలలోకి వెలుగులు తేవాలని, ప్రజల పాపాలు తొలిగిపోవాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్

- ఘనంగా ప్రారంభమైన 'మల్లికార్జున హిల్స్ ప్రీమియర్ లీగ్' (ఎంపీఎల్) సీజన్ 2







**అమీన్‌పూర్ జనవరి : 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
నిత్యం పనుల ఒత్తిడిలో ఉండే వారు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలను ఆశ్రయించాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ అన్నారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని మల్లికార్జున హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన (ఎంపీఎల్) సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్?ను ఆదివారం ఉదయం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఉద్యోగ, వ్యాపారాలతో బిజీగా ఉంటూ చాలామంది శారీరక శ్రమకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్రీడా పోటీలు కాలనీ వాసుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడమే కాకుండా, ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయని కొనియాడారు. అనంతరం ఆయన స్వయంగా బ్యాట్ పట్టి కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో నందారం రమేష్ గౌడ్, శంకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి,మల్లికార్జున హిల్స్ కాలనీ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు మరియు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదల సేవలో ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం: మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి






**అమీన్‌పూర్ : జనవరి 25(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
నిరుపేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అమీన్?పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని భారత్ నగర్ కాలనీలో శ్రీ వేద మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ మరియు జ్యోతి ఫార్మసీ అధినేత డాక్టర్ వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో లేని ఈ రోజుల్లో, డాక్టర్ వెంకట రెడ్డి గారు ముందుకు వచ్చి ఉచిత సేవలందించడం గొప్ప విషయమన్నారు. ఈ శిబిరాన్ని కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమ ంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, కొల్లూరు చంద్రకళ గోపాల్, సీని యర్ నాయకులు ఆసిఫ్, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, శ్రీ వేద హాస్పిటల్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డాక్టర్ వెంకట రెడ్డి మాట్లాడుతూ:సేవే లక్ష్యం: “వైద్యం అనేది కేవలం వ్యాఎరం కాదు, అది ఒక సామాజిక బాధ్యత. నిరుపేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతోనే ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశాం.” ముందస్తు గుర్తింపు: “చాలామంది ఆర్థిక ఇబ్బందుల వల్ల చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తారు. అది భవిష్యత్తులో ప్రాణాపాయంగా మారే అవకాశం ఉంది. ఇలాంటి శిబిరాల ద్వారా వ్యాధులను ముందస్తుగా గుర్తించి, సరైన చికిత్స అందిం చవచ్చని ఆయన తెలిపారు.”నిరంతర సేవలు: “భారత్ నగర్ కాలనీలోనే కాకుండా, అమీన్‌పూర్ మున్సిపాలిటీ వ్యాప్తంగా మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను శ్రీ వేద హాస్పిటల్స్ మరియు జ్యోతి ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ నిర్వహిస్తాం.”ఉచిత పరీక్షలు ఒ మందులు: “ఈ శిబిరంలో బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్ల సలహాలు మరియు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.”ఆరోగ్యమే మహాభాగ్యం: “ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.”ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాశెటి కృష్ణ, సీనియర్ నాయకులు కొల్లూరు గోపాల్, ఆసిఫ్, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, శ్రీ వేద హాస్పిటల్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం భారీ ర్యాలీ నిర్వహణ







**పటాన్‌చెరు జనవరి 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 40- పటాన్?చెరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆదివారం భారీ అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక మైత్రీ గ్రౌండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీని ఎన్నికల అధికారులు ఘనంగా ప్రారంభించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్య బలోపేతానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ (ఈఆర్వోలు), (ఏఈఆర్వోలు), (బీఎల్ఓ) సూపర్ వైజర్లు పాల్గొన్నారువీరితో పాటు రెవెన్యూ, మున్సిపల్ ఎంఈఓలు, మరియు జీహెచ్ఎంసీ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటు హక్కుపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.

# ప్రజాస్వామ్య ములో ఓటు హక్కు వజ్రాయుధమని , 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.










**మెదక్ జనవరి 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

ఆదివారము మెదక్ జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం నుండి బాలుర జూనియర్ పాఠశాల మరియు కళాశాల మైదానం వరకు 16 వ జాతీయ ఓటర్ దినోత్స వాన్ని పురస్కరించుకొని ర్యాలి నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు పాల్గొన్నారు జాతీయ ఓటరు దినోత్సవం సందర్బంగా జిల్లా అధికారులు, ఓటర్ల అందరిచే ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు అనంత ˇరం 16 వ జాతీయ ఓటరు దినోత్సవము సందర్బంగాకళాశాల మైదానం గ్రౌండ్లో. నందు ఏర్పాటు చేసిన సమావేశములో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అందరు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహనా కలిపించికోవాలని సూచించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడంతో పాటు, ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ఎనిమిది మందికి ఓటు హక్కు కలిపిస్తూ బ్యాడ్జీలు పంపిణి చేశారు. ప్రజాస్వామ్యములో 85 సంవత్సరాల నుండి ఓటు హక్కు వినియోగించుకున్న03 మంది సీనియర్ సిటిజన్స్ కు ఈ సందర్బంగా శాలువా లతో సన్మానం చేశారు. ఓటరు అవగాహనా కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిమ కనబరిచిన వారికి సర్టిఫికేట్ లు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, వ్యవసాయ అధికారి దేవకుమార్ , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ఇంటర్మీడియట్ అధికారి మాధవి , ,తాసిల్దార్ లక్ష్మణ్ బాబు , ఎన్నికల తాసిల్దార్ గఫార్, డీఎస్పీ ప్రసన్నకు మార్,, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు,,అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రుక్మాపూర్ గ్రామంలో నూతన బోర్ మోటార్ ని ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ నవీన్





**చేగుంట జనవరి 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో పర్యటించిన దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గ్రామ సర్పంచ్ తో కలిసి నూతన వాటర్ బోర్ మోటర్ ప్రారంభించారు.అంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు,అలాగే గ్రామ సర్పంచ్ నవీన్ గ్రామ పంచాయతీ లోమర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించి గ్రామ సమస్యలను వివరించారు, ఈ కార్యక్రమంలో చేగుంట మండల ఎఎంసి ఛైర్మెన్ తాడేం వెంగళరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,రెడ్డిపల్లి జూఖిఎం ఛైర్మెన్ మ్యాకల పరమేశ్, గ్రామ ఉపసర్పంచ్ కొలుపుల రామస్వామి వార్డు సభ్యులు,వివిధ గ్రామ సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, మండల ఎఎంసి డైరెక్టర్లు,మండల యూత్ కాంగ్రెస్ నాయకులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# చైతన్యబాటలో టీఆర్ పీలోకి భారీ చేరికలు ధర్మారం టీ పాయింట్ వద్ద గ్రామస్తులతో టీఆర్‌పి నేతల చర్చ





**మెదక్, రామాయంపేట జనవరి 25: మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

మెదక్ జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చైతన్యబాట కార్యక్రమంలో భాగంగా నర్సింగ్ మండలం భీమ్రావుపల్లి గ్రామం, రామాయంపేట మండలం ధర్మారం గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీఆర్‌పీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి టీఆర్‌పి జిల్లా నాయకులు పార్టీ కండువాలు కప్పి సాధారంగా స్వాగతించారు.చైతన్యబాట కార్యక్రమం ద్వారా పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను గ్రామస్థులకు వివరించిన టీఆర్?పి నాయకులు, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున నిరంతరం పోరాడుతామని తెలిపారు. గ్రామస్థులు టీఆర్‌పీ కార్యక్రమాలకు మంచి స్పందన వ్యక్తం చేస్తూ పార్టీలో చేరడం ఉత్సాహాన్ని కలిగించిందని నేతలు పేర్కొన్నారు. రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలోని టీ పాయింట్ వద్ద టీఆర్‌పి నాయకులు గ్రామస్తులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యలు, రోడ్లు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను వివరించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టీఆర్?పి నాయకులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శి బసాపురం నగేష్ ముదిరాజ్, మెదక్ జిల్లా అధ్యక్షులు ఇమాంపురం యాదగిరి గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు కమలయ్య, సురేష్ ముదిరాజ్, చేగుంట మండల అధ్యక్షులు కంచర్ల సిద్దా గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ముదిరాజ్, జిల్లా కోశాధికారి మంకిడి రాములు ముదిరాజ్, అధికార ప్రతినిధి పగిడిమారి శేఖర్ నేత, జిల్లా యువత అధ్యక్షులు పోతుల రవీందర్, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతోనే మున్సిపాలిటీల వికాసం: ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

- బీజేపీలో చేరిన ఇస్నాపూర్ యువత.. కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ
- సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో ఎగిరేది కాషాయ జెండాయే!





**రామచంద్రాపురం జనవరి: 25 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యమవుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని తన నివాసంలో పటాన్?చెరు నియోజకవర్గం, ఇస్నాపూర్?కు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి అంజిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు: మోదీ పథకాలే శ్రీరామరక్ష: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన స్మార్ట్ సిటీ, అమృత్ వంటి పథకాల ద్వారా వస్తున్న నిధులే మున్సిపాలిటీలకు జీవనాడిలా మారాయని పేర్కొన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులతో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నారని తెలిపారు.11 మున్సిపాలిటీలపై కన్నేసిన బీజేపీ: త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలోని మొత్తం 11 మున్సిపాలిటీల్లో బీజేపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.అభివృద్ధి అంటే చూపిస్తాం: మున్సిపాలిటీల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే.. కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకువచ్చి 'అసలైన అభివృద్ధి' అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు.మన్ కీ బాత్ వీక్షణ:అంతకుముందు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. దేశాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం గురించి ప్రధాని చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి, సీనియర్ నాయకులు రాజేశ్వర్ దేశ్ పాండే, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడప దాటడం లేదు

**సిగాచి బాధితులకు దిక్కు లేదు కానీ.. ఎన్నికల వేళ రూ.15 కోట్ల హామీలా?**

**గడీల శ్రీకాంత్ గౌడ్ ధ్వజం -- ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో తరిమికొడతామని హెచ్చరిక**

**పటాన్ చెరు జనవరి 25: (మెక్ టుడే) న్యూస్ ప్రతినిధి**




కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే హామీలకు, చేసే పనులకు పొంతన లేదని, ప్రజలను మోసం చేయడంలో ఆ పార్టీ నేతలు ఆరితేరిపోయారని మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో జరిగిన కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి చేసిన రూ.15 కోట్ల నిధుల ప్రకటనపై ఆయన ఘాటుగా స్పందించారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ సంధించిన ముఖ్యమైన ప్రశ్నలు మరియు విమర్శలు:మాట తప్పిన సర్కార్: "సిగాచి ప్రమాదం జరిగి 7 నెలలు గడుస్తున్నా, నాడు ప్రకటించిన రూ.1 కోటి నష్టపరిహారం నేటికీ అతీగతీ లేదు. బాధితుల కన్నీళ్లు తుడవడం చేతగాని ఈ ప్రభుత్వం, ఏ మొహం పెట్టుకుని మళ్ళీ ఇక్కడికి వచ్చి రూ.15 కోట్లు ఇస్తామని ప్రగల్భాలు పలుకుతోంది" అని ప్రశ్నించారు.చిత్తశుద్ధి ఎక్కడ?: "మీకు, మీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ముందుగా సిగాచి మృతుల కుటుంబాలకు ఇచ్చిన మాట ప్రకారం కోటి రూపాయలు విడుదల చేయండి. ఆ తర్వాత రూ.15 కోట్లు ఇస్తారో, రూ.20 కోట్లు ఇస్తారో అది దేవుడెరుగు!" అంటూ ఎద్దేవా చేశారు.ఎన్నికల స్టంట్లు నమ్మం: ఎన్నికలు వస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టడానికి కోట్ల రూపాయల నిధులు కుమ్మరిస్తామని చెప్పడం కాంగ్రెస్ డ్రామాల్లో భాగమేనని ఆయన మండిపడ్డారు.తస్మాత్ జాగ్రత్త – తరిమికొడతాం: "రాబోయే మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వచ్చే ముందు మంత్రి వివేక్ గారు ఒక్కటి గుర్తుంచుకోవాలి. సిగాచి బాధితులను వదిలేసి ఓట్ల కోసం వస్తే.. అదే బాధితులతో కలిసి మిమ్మల్ని తరిమికొట్టడం ఖాయం" అని తీవ్రంగా హెచ్చరించారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారని, అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని శ్రీకాంత్ గౌడ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# సీతమ్మ కోనేటి సాక్షిగా..



తాతను స్పెషల్ వాంలో జాయిన్ చేసారు. రాత్రి పది దాటింది, లైట్లు తీసేసారు. చీకటిలో నీలం రంగు చిన్నిచిన్ని లైట్లు వెలుగుతున్నాయి. రాత్రి నిద్రను చప్పరించడానికి సిద్ధపడింది. ఆ కాంతిలో తాత వెండి జుట్టు మెరుస్తోంది. ఆయినకు ఇప్పుడు ఎనభై యేళ్లు దాటాయి. కళ్లు తెరిచినప్పుడల్లా అడుగుతున్నాడు..'రైలుబండి, చీకటి, కమల' అని.. ఒక్కోసారి ఒక్కోలా..మరోసారి ఆ మాటలూ ఉండటం లేదు.'ఆమె వచ్చిందా?"నన్ను చూడటానికి రాదులే!'రైలు దిగి వెళ్లిపోయింది. మళ్లీ కనిపించలేదు'..తాత అట్లా అడగడం ఇది మూడోసారి. లైట్ల వెలుగులో వార్డులోనే తాత మంచం.. గాలికి ఊగుతున్నట్లుగా అనిపించింది. ఒకప్పటి సత్యానికి, ఇప్పుడు గడ్డం వరకూ దుప్పటి కప్పారు. పొడవైన మనిషి, కళు తెరిచి పైకి చూశాడు. స్పష్టంగా కాకపోయినా అన్నీ కనిపిస్తాయి. ఒక్క కమల తప్ప. లోకం నిజాయతీగా ఉన్నప్పుడు సత్యం పుట్టాడు. ఇప్పుడు దుప్పటి కింద సత్యం శరీరం.. ప్రాణంతో ఒకరికోసం ఎదురు చూస్తోంది."తాతా! నిద్రపోతున్నావా'మనవరాలు కిమీ చెయ్యి పట్టుకుని కదిపి..తల అడ్డంగా ఊపాడు తాత."కమల ఊరికి నన్ను తీసుకుపోతావా?".."ఎక్కడుంది తాతా?"తెలీదన్నట్టు చెయ్యి తిప్పాడువిజయనగరం స్టేషన్?లో రైలు కదులుతోంది. అది దాటిపోతే ఉదయం వరకు మరో రైలు లేదు. పరుగెత్తుకుంటూ వెళ్లి రైలు ఎక్కేసాను. అది నాకు అలవాటే, ఇరవై రెండేళ్ల వయసులో అదో సాహసంగా భావించే వాడిని. ఆయాసంతో కాసేపు గేటు దగ్గర ఆగాను. ఇంతలో హడావుడిగా ఒక అమ్మాయి నా భోగీ ముందు పరుగెడుతూ.. రైలు ఎక్కడానికి ప్రయత్నిస్తోంది. చెయ్యి జారిపోతున్నా పట్టువదలడం లేదు. హఠాత్తుగా ఆమె చెయ్యి పట్టుకొని పైకి లాగేసాను. ఇద్దరం ఒకరి ముఖాల్లోకి మరొకరం చూసుకున్నాం. మేమిద్దరం గమనించలేదు.. ఆ భోగీలో కరెంట్ లేదని. అంతా చీకటి. స్టేషను దాటిపోయే వరకూ మాకా విషయం తెలియదు. ఆ ప్యాసింజర్ రైలలో సీటుకోసం వెతికి.. ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాం. నేను కొంచెం సిగ్గుతో ముడుచుక్కూర్చున్నాను."నువ్వెంత వరకు".. అన్నాను తనతో."కంఠకాపల్లి".. అంత చీకట్లోనూ గొంతులో భయం లేకుండా పలికింది."నీ పేరు".. అని అడిగాను."కమల.. డిగ్రీ సెకండ్? ఇయర్? చదువుతున్నాను. మీ పేరేమిటో చెప్పలేదు".. అంటూ మృదువుగా అడిగింది."నా పేరు సత్యం.. డిగ్రీ ఫైనల్? ఇయర్? చదువుతున్నాను".. అన్నాను.ఒకేసారి ఇద్దరం రైలు కిటికీ నుంచి బయటికి చూసి నవ్వుకున్నాం.. గాలికి ఊగే చెట్లను చూసి. ఆమె ముఖం ఒక అస్పష్ట దృశ్యంలా కనిపించింది.బయట గాలికి ఆమె ముంగురులు ఎగిరి పడుతున్నప్పుడు వెనక్కి తోసుకుంటోంది. మౌనంతో సాగే ఈ ఇద్దరి ప్రయాణం.. మా జీవితంలో స్మృతుల సెగగా మారుతుందని ఆ క్షణం తెలియదు. ఆమె గలగలా మాట్లాడుతుంటే నన్ను నేను మరిచిపోయి.. అలా చూస్తుండి పోయాను. ఇంతలో ఏదో స్టేషన్లో రైలు ఆగింది. బయట లైట్ల కాంతి వెలుతురులో అప్పుడు చూసాను.. ఆమె అందమైన ముఖాన్ని. కళ్లమీద విశాలమైన నుదురు, ఆ నుదుటి మీద వెన్నెల ఆరబోసినట్లుంది. మా పరిచయం ఈ రాత్రిని బరువుగా మోస్తోంది. మా మాటల ఇష్టాన్ని చరిత్ర గోడలపై దశాబ్దాలపాటు రాస్తుందేమో. ఇంతలో బ్యాగులో పెన్నూ, కాగితం తీసి.."మీ అడ్రస్? రాయరా?".. అని అడిగింది. ఆమె మాట గొంతుకీ, పెదవులకీ మధ్య దోబూచులాడుతూ మధురంగా పలికింది."ఇంత చీకట్లోనా".. అన్నాను."కాదు. మధ్యలో మీరు దిగే స్టేషన్? కంటే ముందు స్టేషన్లో మన కిటికీ పక్కన వెలిగే కాంతిలో రాసివ్వండి".. అంది."ఆ రెండు క్షణాలు చాలు మన చిరునామాల పరిచయానికి".. "అలాగే".. అన్నాను, ఆమె ముందుచూపునకు ఆశ్చర్యపోయి.నేను మాత్రం ఆమె చిరునామా అడగలేదు."మీరు దిగి వెళ్లిపోయాక.. ఈ చీకటి భోగీలో ఒంటరిగా ప్రయాణం చెయ్యలేను. ప్రయాణికులు ఉన్న మరో భోగీలోకి నన్ను ఎక్కించండి"..నేను నా చిరునామా రాసిచ్చాక ఆమె కళ్లలో ఏదో ఆశ కనిపించింది. మౌనంతో నా హృదయం బరువెక్కింది. నా స్టేషన్? సమీపించే కొద్దీ గుండె వేగం పెరుగుతోంది. ఈ రైలు.. వేకువదాకా నా గమ్యాన్ని సమీపించకపోతే బాగుండునని నా మనసు ఆత్రుత పడుతోంది. కాసేపు మౌనంగా కళ్లు మూసుకున్నాను. ఇంతలో ఆమె.."మీ మౌనంతో మీ ఊరు దాటిపోయేలా ఉన్నారు. ఇప్పుడే ఏదో వంతెన దాటింది. అందుకే మిమ్మల్ని ఒకసారి పిలిచాను" అంది.ఇంతలో నేను దిగాల్సిన స్టేషన్? వచ్చేసింది. మరో భోగీలోకి ఆమెను ఎక్కించి, నవ్వుతూ చేతులూపాను. వర్షం కురిసిందేమో.. నేలంతా తడిగా ఉంది.నువ్వు వెళ్లలేవని చెప్తూ.. భారమైన అడుగులు బరువుగా ముందుకు పడుతున్నాయి.

డాక్టర్? గారి చేతిలో రిపోర్ట్? ఉంది."కిమీ.. నువ్వు డాక్టర్?వి కాకపోతే మరోలా చెప్పేవాడ్ని. మీ తాతయ్యకు ఇకపై పరీక్షలు, మందులు అనవసరం. నీకు తెలుసు కదా!"."అవును సార్?".."తాతకు ఎక్కువ టైం లేదని తెలుసు. అందుకే ఆయనకు ఏం కావాలో అది పెట్టమంటున్నాను. ఆయనకి ఏవో.. ఎప్పటివో జ్ఞాపకాలున్నాయి. ఆయన ఈ చివరి దశలో ఎన్నో ఏళ్ల నాటి గత జ్ఞాపకాన్ని చూసి ప్రశాంతంగా వెళ్లిపోవాలనుకుంటున్నాడు".రిపోర్ట్? చూడగానే కిమీకి తెలిసిపోయింది. మెల్లిగా నడుచుకుంటూ, వార్డులోకి వెళ్లి తాత పక్కన కూర్చుందామె. కళు మూసుకుని పడుకున్నాడతను. ఆమె కూర్చోగానే ఆమె చేతి కోసం వెతుకుతున్నాడు. ఆమె చెయ్యి తీసుకుని రెండు చేతులతో గట్టిగా పట్టుకున్నాడు."తాతా.. ఎలా ఉంది ఇప్పుడు" అడిగింది."కిమీ! డాక్టర్? గారు ఏమన్నారు" చిన్నగా నవ్వుతూ తిరిగి ప్రశ్నించాడు తాత."నువ్వు బాగా నీరసపడిపోయావు. సమయానికి తిని, క్రమం తప్పకుండా బిళ్లలు వేసుకోమని చెప్పారు"."నువ్వా డాక్టరమ్మవే కదా! అబద్ధం చెప్పకూడదు. నా టైం అయిపోయింది. నాకు తెలుసు.. ఇంకా కొన్ని రోజులే అని".కొన్ని రోజుల క్రితం తాత మాటలు బాగానే వినపడేవి. నీరసంగా ఉన్నా, మాటలు స్పష్టంగా అర్థమయ్యేవి. రోజులు దగ్గర పడేకొద్దీ ఆయనీ లోకానికి దూరం అవుతాడేమో అనిపిస్తోంది. బహుశా ఆసుపత్రి వెలుపల ఉన్న, ఈ విజయనగరంతో ఆయనకింకా అనుబంధం ఉండదేమో?! కిమీ బలవంతంగా నాలుగు ముద్దలు తినిపిస్తుండగా.. ఐదో ముద్ద తింటూ నిద్రపోయాడు. తను భోజనం ముగించి ఇంటికి ఫోన్ చేసింది."అమ్మా!.. గులివిందాడ అగ్రహారం ముత్యాలమ్మ గట్టు పక్క ఇంటికి తీసుకుపొమ్మంటున్నాడు. నీకు తెలుసా?.. తాతకు తెలిసిన ఊరా నేనెప్పుడూ వినలేదు.. నాకు తెలిసి నాన్నకు కూడా ఆ ఊరితో సంబంధం లేదు"..కాసేపు తాత ఆరోగ్యం గురించి చెప్పి ఫోన్‌పెట్టేసింది కిమీ.సత్యం ఒంటరిగా నదివైపు చూస్తూ కూర్చున్నాడు. ఒడ్డునే వందేళ్లు దాటిన నిద్ర గన్నేరు చెట్టు కింద పడవలు కట్టి ఉన్నాయి. రేవులో జాలర్లు, ఎవరి పనిలో వారున్నారు. ఈ నది విశాలంగా వొంపు తిరిగి నీలంగా ఉంది. గట్టుని తాకుతూ వెళ్తోంది.నేనూ, కమల పరిచయమయ్యి అప్పటికే ఆరు నెలలయ్యింది. ఎన్నో ఉత్తరాలతో ఇద్దరం మాట్లాడుకుంటూనే ఉన్నాం. తలుచుకోకపోతే ఇదో కలలాగే ఉంది. తను చదువుకుంటూ నివసించే చోటికి నన్ను చాలాసార్లు పిలిపించుకుని.. ఆప్యాయత, అనురాగాలు కురిపిస్తుంది. కాలేజీకి రెండు రోజులు సెలవులు వస్తే, ఆమె దగ్గరికే వెళ్లిపోయేవాడిని. ఆ రెండు రోజులూ తనతో ఉన్నంతసేపూ నక్షత్రాల లోకంలో విహరించినట్లు ఉండేది. ఆదివారం బద్ధకంగా నిద్రలేచేవాడిని. అది ఓ భయంలేని నిశ్శబ్దపు నిద్ర. లేచి చూసేసరికి తను స్నానం చేసి.. నాకోసం టిఫిన్? రెడీగా చేసి ఉంచేది. ఒక ఆదివారం రోజు మేమిద్దరం కలిసి రామతీర్థం బయలుదేరాం. నెల్లిమర్లలో బస్సు దిగి గుర్రం బండి ఎక్కాం.అక్కడికి వెళ్లడానికి ఏ రవాణా సౌకర్యాలు లేవు. రాముడు-సీతమ్మ వారితో కలిసి వనవాసం చేసిన కొండమీద కూర్చున్నాం. సీతమ్మ వారు స్నానం చేసిన కోనేరులో నీళ్లు పసుపు రంగులో ఉన్నాయి. ఆ నీళ్లు ఇద్దరం నెత్తిమీద చల్లుకున్నాం. కొంచెం దూరంలో సూది కొండమీద ఉన్న రాముడి పాదాలను దర్శించుకుందామని బయలుదేరాం. ఏనుగు ఆకారంతో ఉన్న పలుకు రాయిమీద రాముని పాదాలు చేతులతో కళ్లకు అద్దుకుని నమస్కరించుకున్నాం. ముసురు మేఘం కింద మా తలలపై చినుకుల వర్షం కురిసిందపుడు. ఆనందంతో ఇద్దరం ఒక్కసారిగా గట్టిగా హత్తుకున్నాం. సన్నని వర్షంలో తడుస్తూ గుబురు చెట్టు కింద తల దాచుకున్నాం. ఈ ఏకాంతంలో కలిసిన మాకు ఒంటరితనం దూరమైంది. మధ్యాహ్నకాశపు గాలికి రెక్కలు మొలిచాయి. ఆకలి, మొలకెత్తే ఒక్క భూమికే కాదు.. మా ఇద్దరిలో ఆకలి మొదలైంది."సత్యం! రాముడు సీతతో నడయాడిన ఈ కొండమీద. నీ ఒడిలో పడుకొని, స్వర్గపు సంగీతాన్ని వినాలనుకుంటున్నాను".. అంటూ ఒడిలో వాలిపోయింది."నా తనువు ఈ అణువులో కలిసిపోయే వరకూ నన్ను నిద్రలేపకు. ఇలాగే పడుకోనీ. ఒకవేళ నేను చివరిదాకా రాలేకపోతే నా జ్ఞాపకాల అడుగులను నీతో చివరిదాకా తీసుకెళ్తావు కదూ!"..నేను చిన్నగా నవ్వి తలదించుకొని, ఆమె నిశ్శబ్దపు ముఖాన్ని దగ్గరికి లాక్కుని.. జీవం తొలగిపోని శక్తితో తనను జీవితాంతం ఇలాగే చూసుకుంటానని గోముగా తలనిమిరాను. నా చేతుల స్పర్శను తన గుండెకు హత్తుకుని తనను తాను మరచి పోయింది. ఆమె కళ్లలోకి చూసిన నాకు.. ఆమె చిరకాలపు సుఖతలంపై నిద్రిస్తున్నట్లుంది. వర్షంలో చెట్టుపై తడిసిన పూలు.. గాలికి ఎగిరొచ్చి మీద పడుతున్నాయి. ప్రేమతో దగ్గరికి వచ్చిన ఆ పూలను చేతితో తీసుకొని, ఆమె తలలో పెట్టాను."సత్యం.. ఇది కల కాదుగా!! ఇప్పుడు మనం వేరే లోకపు వెన్నెల్లో పరదా పరుచుకుని పడుకున్నట్లుంది. ఈ స్మృతిని నా చితిదాకా మోస్తానని మాటివ్వు".. అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకుని.."నీకో బహుమతి తెచ్చాను" అంటూ బ్యాగులోంచి లాకెట్?తో ఉన్న బంగారు గొలుసు తీసి నా చేతిలో పెట్టింది."అబ్బో! చాలా బరువుగా ఉందే.. చాలా ఖరీదైన బహుమానం తెచ్చావే!".

# మెదక్ పట్టణ అభివృద్ధికి కృషి పట్టణంలో రూ.4.32కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు





**మెదక్ టౌన్ జనవరి 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

మెదక్ పట్టణంలో అభివృద్ధి బాటలో దూసుకెళ్లేందుకు కృషి చేస్తున్నానని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. మెదక్ పట్టణంలో ఆదివారం 4కోట్ల 32 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్, డ్రైనేజ్ డ్రైనేజ్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రా మాట్లాడుతూ గత పాలకుల పదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో మెదక్ వివక్షతకు గురైందన్నారు. మెదక్ గతం పదేళ్లుగా పాలించిన పాలకులు మెదక్ అభివృద్ధి పట్ల ఆసక్తి చూపక కేవలం వ్యక్తిగత అభివృద్ధి ధ్యేయంగా ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోక నేడు పట్టణ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. అందుకోసం తాను ప్రజల అవసరాలను గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి కృషితో నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# చేగుంట ఎమ్మార్వో శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ఓటర్ల ర్యాలీ

**- ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్ల ర్యాలీ**






**చేగుంట జనవరి 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రం లో ఈరోజు ప్రజాస్వామ్య పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మార్వో శివ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలతో కలిసి ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ చౌరస్తా వరకు సాగి, "ఓటు హక్కు --మన హక్కు, మన బాధ్యత" అనే నినాదాలతో మార్మోగింది. అనంతరం ఎమ్మార్వో మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ నిర్వహించాము అని, జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 25న జరుపుకుంటారు. ఇది 16వ జాతీయ దినోత్సవం అని. తెలంగాణలో ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించబడతాయని తెలిపారు.ర్యాలీ అనంతరం మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అక్కడ ఎమ్మార్వో స్వయంగా ప్రజలకు ఓటర్ల ప్రతిజ్ఞ చేయించి, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ ముఖ్య ఉద్దేశం కొత్తగా నమోదు అయిన యువ ఓటర్లలో అవగాహన పెంచడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రోత్సహించడం.ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. "ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి" అని ఎమ్మార్వో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో శివప్రసాద్ తహసీల్దార్, శ్రీనివాస్ నాతీ. అసిస్టెంట్ ,జయభారత్ రెడ్డి గిర్దవర్, కృష్ణ కుమార్ ఆపరేటర్, రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు చిట్టబోయిన శ్రీనివాస్,డీలర్లు దివాకర్,నగేష్, వెంకట్ గౌడ్, మల్లేశం, బిక్షపతి,రామచంద్రం, రాము, రవీందర్ అండ్ గ్రామపాలన ఆఫీసర్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# బావాబామ్మర్దులు ఇసుక అమ్ముకుని వేలకోట్లు దోచుకున్రు

**- హరీష్ రావ్, కేటీఆర్లపై మైనంపల్లి హన్మంతరావ్ ధ్వజం**



**మెదక్ టౌన్ జనవరి 25 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**

బావాబామ్మర్దులు అక్రమంగా ఇసుక అమ్ముకుని వేలకోట్లు దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ పట్టణానికి చెందిన మెదక్ సొసైటీ మాజీ చైర్మెన్, మాజీ కౌన్సిలర్చింతల నర్సింలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల కిష్టయ్య, మాజీ కౌన్సిలర్ మాడిశెట్టి అంజయ్య తమ అనుచరులతో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాయ గార్డెన్ నుంచి వెంకటేశ్వర గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో మైనంపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో అప్పుడు మంత్రిగా ఉన్న హరీష్ రావ్ హవేలి ఘనపూర్ మండలం సర్ధన వద్ద మంజీరా నది నుంచి, కొల్చారం మండలం కొంగోడ్ వద్ద హల్దీ వాగు నుంచి అక్రమంగా పెద్ద ఎత్తున ఇసుక తరలించి అమ్ముకున్నారని ఆరోపించారు. ఇసుక దొంగతనం ఎవరు చేశారో మెదక్ ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఆయనకు వేల కోట్లు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. హరీష్ రావ్ మెదక్ జిల్లాలో ఇసుక అమ్ముకుంటే, ఆయన బావ మరిది కేటీఆర్ సిరిసిల్ల జిల్లాలో నుంచి పెద్ద మొత్తంలో ఇసుక తరలించి అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. అక్కడి దళితులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటే వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగింపజేశారని, దాంతో సంసారానికి పనికి రాకుండా అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్ మెదక్ వచ్చి ఎంతో అభివృద్ధి చేశామని చెప్పడాన్ని హన్మంతరావ్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాములో మెదక్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను సిద్దిపేట తరలించారని, వాటన్నింటిని మళ్లీ మెదక్ తీసుకొస్తేనే ఆయనకు గౌరవిస్తామని, లేకుంటే ఇక్కడ తిరగకుండా అడ్డుకునే పరిస్థితి ఉంటుందన్నారు. హరీష్ రావ్ వెంట ఉన్న వారు కుంబకోణాలకు పాల్పడ్డారని హన్మంతరావ్ ధ్వజమెత్తారు. ఒకాయన సొసైటీని దోచుకున్నారని



పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే పద్మా రెడ్డి భర్త దేవేందర్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారాన్ని ఉపయోగించి అతనిపై యాక్షన్ లేకుండా అందరిని మ్యానేజ్ చేశారన్నారు. అన్ని కుంబకోణాలు బయట పెడతామని, క్యారెకర్టర్ లేని వారి భాగోతాలు బయటకు తీస్తామన్నారు. కొన్ని నెలల కిందట భారీ వరదలు వచ్చి విపరీతమైన నష్టం జరిగినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ వచ్చి పంట నష్టం పై రివ్యూ చేశారని గుర్తు చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా వరదలు వచ్చినప్పుడు ఇలా స్పందించలేదన్నారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్, తాను కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సహాయకార్యక్రమాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. మెదక్ అభివృద్ధి విషయంలో ఎట్టి పరిస్థితిలో వెనుకకు పోమని, రోహిత్ రావ్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మెదక్ నియోజకవర్గానికి దాదాపు రూ. 200 కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. మెదక్ చర్చి వద్ద అభివృద్ధి పనులకు రూ. 29. 34 కోట్లు, ఏడుపాయల అభివృద్ధి పనులకు రూ. 35 కోట్లు, మెదక్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 80 కోట్లు మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో సీనియర్లకు పోటీ చేసే అవకాశం దొరక్క పోతే వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ జిల్లా యూత్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు మందుల గంగాధర్ చంద్రపాల్ మాజీ కౌన్సిలర్లు వివిధ మండల అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..